


# విభారె తెలుగు దినపత్రిక

# VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 19-11-2023 సంపుటి : 06 సంచిక : 74 పేజీలు : 8 వెల : రూ 3-00

## నిధులను దుర్వినియోగం చేస్తున్న సిఎం కెసిఆర్

**బిజెపితోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యం**
**ఎన్నికల హామీలు అమలు చేయడంలో**
**కెసిఆర్ విఫలం : అమిత్‌షా**



గద్వాల:నవంబర్18 : జోగులాంబ శక్తి పీఠం కోసం మోదీ సర్కార్ 70 కోట్లు ఇస్తే కేసీఆర్ ప్రభుత్వం ఆ నిధులను ఖర్చు చేయలేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. శనివారం అమిత్ షా గద్వాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.."కేసీఆర్ ఇచ్చిన హామీలు ఏవి నెరవేర్చలేదు. గుర్రం గడ్డ వంతెన, గట్టులిఫ్ట్, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయలేదు. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చే అంశం కేసీఆర్ కేంద్రం దృష్టికి తీసుకు రాలేదు. బీజేపీ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తక్షణమే అమలు చేస్తాం. 52 శాతం బీసీ ఓటర్లు 130 కులాలున్న బీసీలను కేసీఆర్ ప్రభుత్వం విస్మరిస్తోంది. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తాం. బీసీలకు బడ్జెట్‌లో బీజేపీ ప్రభుత్వం 3,300 కేటాయిస్తే.. కేసీఆర్ 77 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. టీఎస్పీఎస్సీ పరీక్షల రద్దు, పేపర్ లీక్‌లతో నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోయారు. ప్రవల్లిక ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణం. బీజేపీ ప్రభుత్వం ఏర్పడగానే రెండున్నర లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. తెలంగాణ విమోచన దినోత్సవం జరుపుతాం. ముస్లిం మతపర రిజర్వేషన్లు రద్దు చేస్తాం. దేశంలో, రాష్ట్రంలో 2జీ, 3జీ, 4జీ కుటుంబ పాలన నడుస్తోంది. 2జీ కేసీఆర్ - కేటీఆర్, 3జీ ఓవైసీ మూడు తరాలు, 4జీ గాంధీ 4 తరాలు దేశాన్ని, రాష్ట్రాన్ని ఎలాయి. తెలంగాణలో బీఆర్ఎస్‌కు విముక్తి కల్పించండి. రాష్ట్రంలో బీఆర్ఎస్ అవినీతి మయంగా మారింది. కాంగ్రెస్ పార్టీ అయోధ్యలో రామ మందిర నిర్మాణాన్ని 70ఏళ్ల నాన్చింది. జనవరి 22వ తేదీన అయోధ్య రామ మందిర ప్రతిష్ఠ జరగనుంది. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే ప్రజలందరికీ అయోధ్య ఉచితంగా కల్పిస్తాం" అని అమిత్ షా స్పష్టం చేశారు.

# ఎపిలో అరాచక, అక్రమ పాలన


**ఇసుక దందాలతో నేరుగా జగన్‌కు ముడుపులు**
**అక్రమాలను ప్రశ్నిస్తే వ్యక్తిగత దూషణలు**
**ఎస్సీ,ఎస్టీలపై కూడా దాడులతో బెదిరింపులు**
**బురిలంక రేవు వద్ద ఇసుక తవ్వకాలను పరిశీలించిన బిజెపి,జనసేన**
**ప్రభుత్వ తీరును ఎండగట్టాలని పురందేశ్వరి పిలుపు**



కాకినాడ,నవంబర్18 : ఏపీలో నేడు అరాచక పాలన సాగుతోందని బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి అన్నారు. శనివారం నాడు బీజేపీ పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఏపీలో విద్వేషపూరిత పాలనను నేడు మనమంతా చూస్తున్నాం. చాలా ప్రాంతాల్లో వైసీపీ నాయకులు ఇసుకను దోచుకుంటూ.. కోట్లు కూడేసుకుంటున్నారు. ఎవరైనా ఇసుక అక్రమాలపై ప్రశ్నిస్తే.. సమాధానం మాత్రం చెప్పరు. అడిగిన వారిపై వ్యక్తిగత దూషణలు చేస్తూ.. వారిపైనే ఎస్సీ, ఎస్టీ కేసులు పెడుతున్నారు. వైసీపీ ఫ్లెక్సీ చింపారని హోంమంత్రి నియోజకవర్గంలోనే ఒక ఎస్సీ యువకుడు పురుగుల మందు తాగి చనిపోయాడు. నా ఎస్సీ, నా ఎస్టీ అని చెప్పుకునే జగన్ ఆ కుటుంబానికి ఏమి న్యాయం చేశారని ప్రశ్నిస్తున్నా. సామాజిక న్యాయం పేరుతో బస్సు యాత్ర ప్రచార ఆర్భాటమే. చనిపోయిన యువకుడి కుటుంబానికి సామాజిక న్యాయం ఏం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను, మోదీ చేసిన మేలును ప్రజల్లోకి తీసుకు వెళ్లాలి. గ్రామగ్రామాన ఉన్న బీజేపీ నాయకులు ప్రజల్లోకి వెళ్లి ఈ అంశాలను వివరించాలని పురంధరేశ్వరి తెలిపారు. అడ్డగోలుగా ఇసుక దందా సాగుతోందని పురందేశ్వరి ఆరోపించారు. తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం బురిలంక రేవు వద్ద ఇసుక తవ్వకాలను బీజేపీ, జనసేన నేతలతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి నర్సరీ రైతులు ఇసుక అక్రమాలను ఇరు పార్టీల నేతలకు వివరించారు. దశాబ్దాలుగా ఇలాంటి ఇసుక దందా చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరికైనా చెప్తే చంపేస్తాం, కాల్చిపారేస్తాం అనేలా బెదిరిస్తున్నారని వాపోయారు. బుర్రలంకలో ఇసుక ర్యాంపుల్లో అక్రమంగా తవ్వకాలు జరుగుతున్నాయని ప్రశ్నిస్తే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని పురందేశ్వరి మండిపడ్డారు. నాలుగు ఐదు కిలో మీటర్ల మేర లారీలు క్యూ లైన్‌లో ప్రమాదకరంగా ఉన్నాయని ఆరోపించారు. వైసీపీ ఆగడాలకు కడియం నర్సరీ రైతులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. పర్యావరణ నిబంధనల ప్రకారం మిషనరీతో తవ్వకాలు జరుగుతున్నాయని.. దీనివల్ల ధవళేశ్వరం బ్యారేజ్ తో పాటు పర్యావరణానికి ముప్పు ఉందన్నారు. కంపెనీ పేరు లేకుండా బిల్స్ ఉన్నాయని, ఢిల్లీలో ఉన్న వారి పేరుతో ఇక్కడ తవ్వకాలు ఇల్లీగల్ గా జరుగుతున్నాయని ఆరోపించారు. ఆంధ్రాలో ఇసుక సరఫరా దోచుకో దాచుకో అన్న చందాన జరుగుతోందని మండిపడ్డారు. జేపీ సంస్థ ముసుగులో అడ్డగోలుగా ఇసుక దందా సాగిస్తున్నారని మండిపడ్డారు. ఇసుక దోపిడీలో వచ్చే సొమ్మంతా తాడేపల్లికే వెళ్తోందన్నారు.

# బందరు హిందూకళాశాల పీక పిసికేశారు

**నిధులు లేక జీతాలు చెల్లించలేక దైన్యస్థితి**
**ఆనాటి కళాశాలను భ్రష్టుపట్టించారు**
**జనసేనాని పవన్ కళ్యాణ్ ఆవేదన**



అమరావతి,నవంబర్18 : మచిలీపట్నం హిందూ కళాశాల నేడు వైసీపీ పాలకుల నిర్లక్ష్యానికి మసకబారిపోతోందని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. శనివారం నాడు జనసేన పార్టీ కార్యాలయంలో పవన్ మీడియాతో మాట్లాడుతూ..'ఎంతో ఉదారత... మరెంతో సదాశయంతో ఆవిర్భవించిన హిందూ కళాశాల దైన్య స్థితిని చూశాక తీవ్రమైన ఆవేదన కలుగుతోందన్నారు. చివరకు అధ్యాపకులు, సిబ్బందికి నెలనెలా జీతాలు ఇవ్వలేని దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఎయిడెడ్ కళాశాలగా రూపాంతరం చెందిన ఈ సంస్థకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉంది. అయితే ఈ కళాశాలకు నిధులు రావడం ఆగిపోగా, బకాయిలు రూ.2 కోట్ల వరకు చేరుకున్నాయి. జీతాలు లేక అల్లాడిపోతున్న సిబ్బంది చివరకు చేసేది లేక కోర్టు మెట్లు ఎక్కారని తెలిసింది. కళాశాల పేరు మీద 14 ఎకరాల భూమి ఉంది. భవిష్యత్తులో మరెన్నో విద్యాసంస్థల ఏర్పాటుకు ఈ స్థలాన్ని రిజర్వు చేసి.. కళాశాల కమిటీ యాజమాన్యం ఉంచింది. అయితే సిబ్బంది జీతాలు చెల్లించడానికి ఈ భూములను అమ్మకానికి పెట్టిన విషయం తెలిసి చాలా బాధ కలిగిందని పవన్ కళ్యాణ్ తెలిపారు. 1856లో స్థాపించిన హిందూ కళాశాల పునర్ వైభవానికి కృషి చేయాల్సి ఉందన్నారు. జగనన్న విద్యా కానుక పేరిట నాసిరకం బ్యాగులు, బూట్లు విద్యార్థులకు ఇచ్చి కోట్లు కొల్లగొట్టడానికి దారులు వెతికిన ప్రభుత్వ పెద్దలకు.. ఉన్నతాశయంతో ఏర్పాటైన ఈ కళాశాలకు రూ.2 కోట్లు ఇచ్చేందుకు దారులు కనపడ లేదంటే ఆశ్చర్యమే. ఈ ప్రభుత్వ విద్యా విధానం చూస్తుంటే 'ఉట్టికి ఎగరలేనమ్మ స్వర్గానికి ఎగిరిందంట!' అన్న సామెత గుర్తుకు వస్తోంది. ఉగ్గు పాలతోనే పిల్లలంద రికి ఇంగ్లీష్ నేర్పుతామంటున్నజగన్ సర్కారు .. ఉన్నతమైన ఆశయంతో ఏర్పాటైన మచిలీపట్నం కళాశాలను ఎందుకు రక్షించడం చరిత్ర కలిగి న ఈ కళాశాలకు తక్షణమే నిధులు విడుదలచేయాలనిప్రభుత్వాన్ని కోరుతున్నాను.వైసీపీ సర్కారు... ఈ కళాశాల పునర్ వైభవానికి కృషి చేయకపోతే ఎన్నికల అనంతరం జనసేన పార్టీ ఆ బాధ్యతను తీసుకుంటుందని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు.

## కార్పొరేట్ స్కూళ్ల కంటే ఏపీ ప్రభుత్వ బడులు అద్భుతం: అంబటి రాయుడు



తెనాలి : కార్పొరేట్ స్కూళ్ల కంటే ఏపీలోని ప్రభుత్వ స్కూళ్లలో సదుపాయాలు అద్భుతంగా ఉన్నాయని ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు కొనియాడారు. తెనాలి నియోజకవర్గం సంగం జాగర్లమూడిలోని రైతు భరోసా కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ పాఠశాలను రాయుడు పరిశీలించారు.విద్యార్థులు కూడా తమ భవిష్యత్తు బాగుంటుందని నమ్మకంతో ఉన్నారని తెలిపారు.'ఏపీలో స్కూళ్లలో ఉన్న సదుపాయాలు దేశంలో ఎక్కడా లేవు. మధ్యాహ్న భోజన పథకంలో ఇచ్చే ఆహారం రుచికరంగా ఉంది. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో ఏపీ నెంబర్ వన్ రాష్ట్రంగా ఎదుగుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అద్భుతంగా పనిచేస్తున్నాయి. వైద్య ఆరోగ్య రంగంలో ఏ రాష్ట్రం మన రాష్ట్రంతో సరితూగలేదు.రైతు భరోసా కేంద్రాల వల్ల రైతులు ఆనందంగా ఉన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చాలా గొప్ప కార్యక్రమం. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు సంక్షేమ పథకాలతో ప్రజలంతా ఆనందంగా ఉన్నారు' అని రాయుడు అన్నారు.


## ఏరోనాటికల్ సొసైటీ అంతర్జాతీయ సదస్సు ప్రారంభం



ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా 'ఏరోస్పేస్ ఒ ఏవియేషన్ ఇన్ 2047' అంతర్జాతీయ సదస్సు న్యూఢిల్లీలోని యశోభూమి కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ప్రారంభమైంది.నవంబర్ 18, 19 తేదీల్లో రెండు రోజులపాటు జరిగే ఈ అంతర్జాతీయ సదస్సు, ఎగ్జిబిషన్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ప్రారంభించారు.ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ దేశంలో ఏరోస్పేస్ అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషిస్తూ 75 ఏళ్లు పూర్తి చేసుకున్నందుకు ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియాను ఏఈఎస్ఐని అభినందించారు. అనంతరం ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి, వివిధ పరిశ్రమల ఉత్పత్తులను సందర్శించి స్టార్టప్‌లతో సంభాషించారు.శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ దూసుకుపోతోందని, సైన్స్‌లో భారతీయ మహిళల పాత్ర పెరుగుతోందని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. రక్షణ, టూరిజం శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ మాట్లాడుతూ రక్షణ రంగంలో దేశం సాధించిన విజయాలు, భారత ప్రభుత్వం విధాన సంస్కరణలు, రక్షణ రంగంలో ఆత్మనిర్భరత దిశగా డీఆర్‌డీవో చేస్తున్న కృషిని అభినందించారు.ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డి అతిథులను స్వాగతిస్తూ అధునాతన సామర్థ్యాల సాధనతో దేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చడానికి అన్ని పరిశోధన, విద్యాసంస్థలు, పరిశ్రమల కృషిని సమన్వయం చేయడంలో ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా పాత్ర గురించి వివరించారు.అలాగే ఇస్రో చైర్మన్ సోమనాథ్, సీఎస్ఐఆర్ డీజీ డాక్టర్ కలైసెల్వి, డైరెక్టరేట్ ఆఫ్ డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ డాక్టర్ కామత్, ఎయిర్ మార్షల్ ఏపీ సింగ్, వైస్ చీఫ్ ఆఫ్ ఎయిర్ ఫోర్స్, హాల్ చైర్మన్ అనంతకృష్ణన్, పౌర విమానయాన శాఖ సీనియర్ ఆర్థిక సలహాదారు పీయూష్, టాటా సన్స్ ప్రెసిడెంట్ బన్మాలి అగర్వాల్, యూఎస్ఏ జనరల్ అటామిక్స్ సీఈవో డాక్టర్ వివేక్ లాల్ తదితరులు ప్రసంగించారు.సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖులు, నీతి ఆయోగ్ సభ్యులు, భారత ప్రభుత్వ కార్యదర్శులు, వివిధ సంస్థల అధిపతులు, అంతర్జాతీయ నిపుణులు, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు, విద్యాసంస్థలు, స్టార్టప్‌లు, విద్యార్థులతో సహా 1,500 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు.

## ఇక భారత్‌లోనే ఎల్‌ఏసీ మార్క్-2 ఫైటర్ జెట్ ఇంజిన్ల తయారీ..! జనరల్ ఎలక్ట్రిక్‌కు అమెరికా గ్రీన్ సిగ్నల్..!

భారత్‌లో ఎల్‌ఏసీ మార్క్-2 ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ జెట్ ఇంజిన్ల తయారీకి మార్గం సుగమమైంది. జనరల్ ఎలక్ట్రిక్ సహకారంతో ఇకపై దేశంలో ఫైటర్ జెట్ల ఇంజిన్లు తయారీకి అమెరికా అన్ని అనుమతులు జారీ చేసింది. ఈ సందర్భంగా డీఆర్డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వీ కామత్ మాట్లాడుతూ ఎల్‌సీఏ మార్క్-2 ఇంజిన్లు స్వదేశీ అధునాతన మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లోని మొదటి రెండు స్క్వాడ్రన్‌లను అమెరికన్ కంపెనీ జనరల్ ఎలక్ట్రిక్ సహకారంతో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ తయారు చేస్తుందని తెలిపారు.ఇందుకు సంబంధించిన అన్ని అనుమతులను అమెరికా పేర్కొన్నారు. జూన్‌లో ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా రక్షణ తయారీ రంగంలో ఇరు దేశాల మధ్య పలు ముఖ్యమైన ఒప్పందాలు జరిగిన విషయం తెలిసిందే. ఇందులోభాగంగా భారతీయ కంపెనీ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌తో కలిసి అమెరికా కంపెనీ జనరల్ ఎలక్ట్రిక్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్లను తయారు చేయనుంది. జనరల్ ఎలక్ట్రిక్ సంయుక్తంగా యూఎస్ కాంగ్రెస్‌లో ఫైటర్ ఇంజిన్‌లను తయారు చేసేందుకు అనుమతి కోరుతూ దరఖాస్తు చేసింది.ఇప్పుడు అమెరికా ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని డీఆర్డీవో చీఫ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సహకారంతో జనరల్ ఎలక్ట్రిక్ ఎఫ్-414 జెట్ ఇంజిన్లను తయారీ చేయనున్నది. రెండు కంపెనీలు కలిసి భారతదేశంలో 99



## ఈ నెల 20 వ తేదీ న కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జగనన్నకు చెబుదాం

**-స్పందన కార్యక్రమంమండల, డివిజన్,మునిసిపల్ కార్యాలయాల్లో కూడా జగనన్నకు చెబుదాం స్పందన .. ప్రజల నుండి వినతుల స్వీకరణ**
**జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన**

కర్నూలు, నవంబర్ 18 :- ఈనెల 20 వ తేదీ సోమవారం కర్నూలు కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన శనివారం ఒక ప్రకటనలో తెలిపారుజిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# సంపాదకీయం

ఆదివారం 19-11-2023

## తెలంగాణలో దొరహంకారంపై చర్చ!

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరవాత....తొమ్మిదన్నరేళ్ల కెసిఆర్ పాలన తరవాత మూడోమారు వస్తున్న అసెంబ్లీ ఎన్నికలు కావడంతో ఇప్పుడు అనేక అంశాలు ప్రచారంలో చర్చకు వస్తున్నాయి. అనేకానేక హామీలు..చేసిన అభివృద్ది.. బంగారు తెలంగాణ, ధరణి, కరెంట్ ఇలా ప్రచారంలో ఈ అంశాలు ఏ మేరకు ప్రభావితం చేస్తాయన్నది పక్కన పెడితే.. ఇవే ఇప్పుడు ప్రధాన ప్రచారాంశాలుగా మారాయి. కెసిఆర్ గడీల పాలన, నిరంకుశ పాలన, అవినీతి, కుటుంబ పాలన అన్నవి ఇప్పుడు ప్రధాన ప్రచారాంశాలుగా తెలంగాణ ఎన్నికల సమరంలో శరాల్లా దూసుకు వస్తున్నాయి. ఈ అంశాలపైనే విమర్శలు ఎక్కుపెడుతున్నారు. తెలంగాణ రక్తంలో ఆత్మాభిమానం అన్నది చాలా ఎక్కువపాళ్లు ఉంటుంది. దేన్నయినా సహిస్తారు కానీ.. ఆత్మాభిమానం దెబ్బతింటే సహించరు. తెలంగాణ ఉద్యమానికి అదే పునాది. అదే ఇప్పుడు ప్రధాన ప్రచారాంశంగా మారుతోంది. ఆత్మగౌరవ నినాదం ప్రధానంగా ముందుకు వస్తోంది. కెసిఆర్ ఎన్ని అభివృద్ధి పనులు చేసినా ప్రజల్లో ఆత్మాభిమానం అన్నది చర్చగా మారింది. కుటుంబ పాలన, అహంకారం అన్నవి ప్రజల్లో చర్చగా మారాయి. కెసిఆర్ చేస్తున్న సంక్షేమపథకాలు ఆయన ఇంట్లోనుంచి డబ్బు ఖర్చు పెట్టి చేస్తున్నవి కాదు. దీనికితోడు అప్పులు తెచ్చి అభివృద్ధి పేరుతో దుబారా చేస్తున్నారు. కాళేశ్వరం లక్ష్యం నెరవేరలేదు. ఇలా చెప్పుకుంటూ పోతే నిరుద్యోగుల సమస్య తీవ్రంగా ఉంది. ప్రత్యేక రాష్ట్రంలో తెలంగాణ ప్రజల కష్టాలు తీరకపోగా మరింత పెరిగినాయి. యువతకు ఉపాధి దొరకడం కష్టంగా మారింది. ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్య నిర్లక్ష్యానికి గురికావడంతో స్కూళ్లు మూతపడ్డాయి. ఓ రకంగా చెప్పాలంటే మూతపడేశారు. విశ్వవిద్యాలయాలకు నిధులు లేవు. చదువు చెప్పే ఆచార్యులు లేరు. సర్కారు ప్రైవేటు విద్యను ప్రోత్సహిస్తున్నది. ప్రభుత్వ వైద్యం కూడా అధ్వానంగా మారి ప్రైవేటు ఆసుపత్రుల్లో దోపిడీ విపరీతంగా పెరిగింది. ప్రైవేట్ స్కూళ్లు కావచ్చు.. ఆస్పత్రులు కావచ్చు ..వాటి మీద సర్కారు నియంత్రణ లేదు. చెరువుల ఆక్రమణలు పెరిగాయి. మిషన్ కాకతీయ పేరు చెప్పి కోట్లు వృధా చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఛోటా మోటా లీడర్ల భూ ఆక్రమణలు, దందాలకు అంతే లేకుండా పోయింది. మిషన్ కాకతీయ అధికార పార్టీ ఎమ్మెల్యేలకు ఆదాయ వనరుగా మారగా భూకబ్జాలకు దగ్గర దారిగా మారింది. రియల్ ఎస్టేట్ మీద ప్రభుత్వ పెద్దల దృష్టి ఉండడంతో సామాన్యుల భూములు చేతులు మారుతున్నాయి. భూమిలేని పేదల సంఖ్య రాష్ట్రంలో పెరుగుతున్నది. భూమిని నమ్ముకున్న వారిని మోసం చేస్తున్న ఈ ప్రభుత్వం ఉమ్మడి ఆస్తులుగా భావించే భూములను ప్రైవేటు పరం చేస్తున్నది. మైనింగ్ పేరిట గుట్టలు నామరూపాలు లేకుండా పోతున్నాయి. ఉపాధి లేకపోవడంతో ముఖ్యంగా పట్టణాలకు వలసలు పెరిగాయి. ఇస్తాంబుల్, డల్లాస్ చేస్తానంటూ ఆర్భాటాలు ప్రకటించిన కెసిఆర్ వాటి మాట ఎత్తడం లేదు. బంగారు తెలంగాణ కేవలం నినాదంగానే మిగిలింది. ప్రభుత్వ పెద్దలు ఈ నినాదం చేస్తున్నపుడల్లా, సామాన్యులు ముక్కుమీద వేసేలసుకుని చూస్తున్నారు. ప్రత్యేక రాష్ట్రంలో మెరుగైన పాలన ఉంటుందని ప్రజలు ఆశించారు. అయినా నిరంతరం మభ్య పెట్టడమే లక్ష్యంగా పాలన సాగుతోంది తప్ప మార్పు కానరావడం లేదు. సరికదా కాంగ్రెస్ వస్తే అంతా ఆగం అవుతుందని కెసిఆర్ కుటుంబ ప్రచారంలో దుష్ప్రచారం చేస్తోంది. ప్రభుత్వ పనితీరు మెరుగుపరచడంలో, అవినీతికి దూరంగా ఉండడంలో కెసిఆర్ నాయకత్వం విఫలం అయ్యిందన్న ప్రచారం విపరీతంగా ఉంది. ఏటా దాదాపు 3 శాతం ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేస్తున్నారు. అయినా కూడా ఉద్యోగాల భర్తీ జరగలేదు. కానీ లక్షన్నర ఉద్యోగాల భర్తీ చేశామని చెప్పుకుంటున్నారు. ఇలా కూడా గోబెల్స్ ప్రచారం చేయడం నిరుద్యోగ యువత జీర్ణించుకోలేక పోతున్నది. ఇకపోతే పబ్లిక్‌సర్వీస్ కమిషన్ వ్యవహారంలో డొంకతిరుగుడు సమాధానాలతో నిరుద్యోగులను నిండా ముంచారు. జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లు పెరిగినా..ఒక సాధారణ పౌరుడికి కావాల్సిన సేవలు అందించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలం అయ్యింది. క్షేత్రస్థాయిలో గతంలో ఎప్పుడూ లేనంతగా అవినీతి పెరిగింది. లంచం లేనిదే ఏ పనీ కావడం లేదు. ధరణి పేరుతో ఇప్పుడు రైతులు జిల్లాలు లేదా రాజధానికి రావాల్సి వస్తున్నది. క్షేత్రస్థాయిలో పనిచేసేవారు లేరు, కనీసం చెప్పేవారు లేరు. తెలంగాణలో కొత్తగా 60 దాక మండలాలు ఏర్పడ్డాయి. మొత్తానికి ఇప్పుడు 620 వరకు ఉన్నాయి. కానీ, మండల ఆఫీసులకు భవనాలు లేవు. ఆఫీసులు ఉన్నా ఉద్యోగులు లేరు. ఉద్యోగులు ఉన్నా వారికి తగిన పని లేదు. పథకాల అమలు ఎమ్మెల్యేలే నిర్ణయిస్తుంటే ఇక ఉద్యోగులు చేసేది ఏమీ ఉండదు. కొత్తగా జిల్లాలు ఏర్పాటు అయినా జిల్లా స్థాయి అధికారులు అన్ని శాఖలలో లేరు. ప్రజలతో నేరుగా పని చేయాల్సిన రెవెన్యూ, వ్యవసాయం, విద్య, వైద్య శాఖల పరిస్థితి మరింత ఘోరంగా ఉన్నది. ఇదివరకు జిల్లా కలెక్టరు కేంద్రంగా ప్రభుత్వ పాలన ప్రజలకు అందుబాటులో ఉండేది. సామాన్యులకు ప్రభుత్వ ఆఫీసులు దూరం అయినాయి. పాలనలో పారదర్శకత లోపించింది. పథకాలలో లబ్ధిదారుల ఎంపికలో అనుసరించిన విధానాలు కూడా పారదర్శకంగా లేవు. ప్రజలకు దూరంగా తెలంగాణ ప్రభుత్వ పాలన ఉండడం అన్నది గతంలో ఎప్పుడూ జరగలేదు. ప్రజల ఆకాంక్షల మేరకు ప్రభుత్వ పాలన అందిస్తే ఇవన్నీ చర్చకు వచ్చేవి కావు. అందుకే కెసిఆర్ ఏం చేశారన్నదానికన్నా.. కెసిఆర్ పాలనలో అవినీతి, అహంకార పూరిత నిర్ణయాలే ప్రధాన చర్చనీయాంశంగా మారాయి. వీటినే కాంగ్రెస్ తమకు అనుకూలంగా మార్చుకుని ప్రచారంలో దూసుకుని పోతోంది.అయితే ప్రజలు ఎవరిని ఆదరిస్తారన్నది 30న జరిగే ఎన్నికల తరవాత వచ్చే ఫలితాలను బట్టి తెలుసుకోవచ్చు.

# తన అధికారాన్ని వైసిపి పార్టీకి తాకట్టు పెట్టిన మున్సిపల్ కమిషనర్ గంగి రెడ్డి.

## మాజీ ఎమ్మెల్యే డా బి వి జయనాగేశ్వర రెడ్డి.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ.

ఎమ్మిగనూరు నవంబర్ 18 విభారె న్యూస్.ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తన అధికారాన్ని వైసిపి పార్టీకి తాకట్టు పెట్టారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బి వి జయ నాగేశ్వర్ రెడ్డి ఆరోపించారు. శనివారం మాజీ ఎమ్మెల్యే తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పార్టీ ఎమ్మెల్యే చెన్నాకేశవ రెడ్డి గెలుపొందిన నాటి నుండి ఎమ్మిగనూరులో తలెత్తిన భూ వివాదాలు పెరిగిపోయాయి అన్నారు.ప్రజల ఆస్తులను కాపాడటంలో టిడిపి పార్టీ ఎప్పుడు ముందుంటుందన్నారు.ప్రజలను పీడించి చెత్త పన్ను వసూలు చేయించే పని పై ఉన్న శ్రద్ధ ప్రజలకు మంచి చేయడంలో దృష్టి పెట్టాలన్నారు.ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి కమిషనర్ గా కాకుండా వైసిపి కండువా కప్పుకొని కౌన్సిలర్ గా పోటీ చేస్తే బాగుంటుంది అన్నారు. ఎమ్మిగనూరు వైసిపి ఎమ్మెల్యే చెన్నాకేశవ రెడ్డి పై, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగి రెడ్డి పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాడు.గతంలో ఎమ్మెల్యే గా ఉన్న ఇదే చెన్నాకేశవ రెడ్డి గా ఉన్నారు అప్పుడు ఎమ్మిగనూరులో ఎన్నడూ లేని భూవివాదాలు ఇప్పుడు ఎందుకు వస్తున్నాయి అని సూటిగా ప్రశ్నించారు.గతంలో చేనేత కుల బాంధవుడు పద్మశ్రీ మాచాని సోమప్ప కులమతాలకు అతీతంగా దూరదృష్టితో పెద్దలు, పిల్లలు అందరికి ఆహ్లాదం కొరకు సుమారు 6.06 ఎకరాల్లో వైద్యుసిఎస్ గ్రౌండ్ కేటాయిస్తే ఆస్థలంలో షెడ్లు ఏర్పాటు చేయడం సిగ్గు చేటని, దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించి దీనిపై స్టే తీసుకొని వచ్చామని, రాష్ట్ర అత్యున్నత నాయస్థానం కూడా తమ న్యాయమైన అభ్యర్థనను విని 3 నెలల్లోగా వైడబ్ల్యుసిఎస్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన షెడ్లను తొలగించాలని పేరొన్నదని తెలిపారు. హాస్యాస్పదం ఏంటంటే ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగి రెడ్డి ని దీనిపై వివరణ కోరి షెడ్లను తొలగించాలి అని అడిగితే జాప్యం చేసి ఈరోజు మిలిటరీ కాలనిలో సుమారు 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న స్థిర గృహాలను రోడ్ వైండనింగ్ పేరుతో జేసిబిలతో కూల్చడానికి వెళ్లారని అంటే మున్సిపల్ కమిషనర్ గంగి రెడ్డికి పేదలంటే, పేదల ఆస్తులంటే అంతా చులకనా, కోపం ఎందుకు అని పేర్కొన్నారు. ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగి రెడ్డి తమ అధికారాన్ని వైసిపి నాయకులకు తాకట్టు పెట్టి తాను ఒక మున్సిపల్ కమిషనర్ అనే విషయాన్ని మరిచారని, మున్సిపల్ కమిషనర్ గంగి రెడ్డి గారు కమిషనర్ గా కాకుండా వైసిపి కౌన్సిలర్ గా పోటీ చేస్తే బాగుంటుందని హితవు పలికారు. ఈ సమావేశంలో దయాసాగర్ కలీముల్లా కొండయ్య చౌదరి రంగస్వామి గౌడ్ మధుబాబు మల్లికార్జున కటారి రాజేంద్ర బనవాసి అబ్రహం గురు రాజ్ దేశాయ్ ఖాసిం వలి కృష్ణమ నాయుడు బేతాళ బడే సాబ్ రామాంజనేయులు రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం ఆధ్వర్యంలో కృష్ణవేణి సంగీత నిరాజనం

**డిసెంబర్ 10 నుంచి 12 వరకు విజయవాడలో నిర్వహణ**

**కేంద్రపర్యాటక శాఖ కార్యదర్శి విద్యావతి వెల్లడి**

విజయవాడ,నవంబర్18: కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ ఆధ్వర్యం లో డిసెంబర్ 10వ తేది నుండి 12 వరకు విజయవాడలో నిర్వహించనున్న కృష్ణవేణి సంగీత నీరాజనాన్ని ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వ పరంగా పూర్తి సహాయ సహకారం అందించాలనని కేంద్ర పర్యాటక శాఖ కార్యదర్శి వి. విద్యావతి కోరారు. డిసెంబర్ 10 నుండి 12 వరకు విజయవాడలో కృష్ణవేణి సంగీత నీరాజనం నిర్వహణకు చేపట్టవలసిన ఏర్పాట్లపై కేంద్ర పర్యాటక శాఖ కార్యదర్శి వి. విద్యావతి శనివారం నగరంలోని హోటల్ వివంతలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి రజిత్ భార్గవ్, జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు, సబ్ కలెక్టర్ అదితి సింగ్, మున్సిపల్ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో విద్యావతి మాట్లాడుతూ సాంస్కృతి, సాంప్రదాయాలలో తెలుగు భాష యొక్క గొప్పతనాన్ని మరియు వారసత్వాన్ని వెలుగులోకి తీసుకురావడానికి పురాతన కళలైన హరికథ, నామసంకీర్తనలపై ప్రజల దృష్టిని పునరుద్ధరించేందుకు కృష్ణవేణి సంగీత నీరాజనాన్ని నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఇందులో భాగంగా ఆంధ్ర ప్రదేశలో జీవం పోసుకున్న కర్నాటక సంగీతాన్ని సంగీత నీరాజనం ద్వారా తెలుగు వారికి చాటి చెప్పేందుకు సంగీత ఉత్సవాలను పండుగ వాతావరణంలో నిర్వహించనున్నామన్నారు. విజయవాడలో డిసెంబర్ 10వ తేది నుండి మూడు రోజుల పాటు నిర్వహించే కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమంలో నిష్ణాతులైన సంగీత విద్వాంసులు కళాకారులచే కర్నాటక సంగీత కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. కర్నాటక సంగీతానికి చెందిన దాదాపు 30 మంది గురువులు వారి శిష్య బృందం సంగీత ప్రదర్శన ద్వారా కనువిందు చేసేలా ఏర్పాటు చేయనున్నామన్నారు. తెలుగు జాతి సంస్కృతి సాంప్రదాయలను ప్రజలు చాటి చెప్పే విధంగా సంగీత వాయిద్య ప్రదర్శనలతో పాటు తెలుగు వారి వంటకాలతో ఫుడ్ కోర్టులను రాష్ట్రంలో పేరెన్నికగన్న కలంకారి, ఉప్పాడ, వెంటకగిరి, గద్వాల్, పోచనపల్లి, మంగళగిరి వంటి వస్త్రాప్రదర్శన ఏర్పాటు చేయనున్నామన్నారు. కృష్ణవేణి సంగీత నీరాజనం నిర్వహణకు తుమ్మలపల్లి కళక్షేత్రం, బెరంపార్క్, దుర్గాఘాట్‌లు వేదికలు కానున్నాయన్నారు. విజయవాడ నగరంతో పాటు రాష్ట్రంలోని విజయనగరం, బొబ్బిలి, విశాఖపట్నం, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, ఒంగోలు, కర్నూలు నగరాలలో కృష్ణవేణి సంగీత నీరాజనం నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. పండుగ వాతావరణంలో నిర్వహించే కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమాన్ని ప్రజలకు చేరువ చేసేలా ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా, ఎఫ్ యంరేడియో, ఆల్ఇండియా రేడియో, రైల్వేస్టేషన్ల ప్రసార మాధ్యమాల ద్వారా ముందుగా విస్తృత ప్రచారం చేయడంతో పాటు కార్యక్రమాన్ని ప్రత్యేక ప్రసారం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి రజిత్ భార్గవ్ మాట్లాడుతూ తెలుగు సంస్కృతి సాంప్రదాయాలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కృష్ణవేణి సంగీత నీరాజనాన్ని విజయవాడతో పాటు రాష్ట్రంలోని ప్రధాన పట్టణాలలో నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. 700 సీట్ల సామర్థ్యం గల తుమ్మలపల్లి కళాక్షేత్రం సంగీత నీరాజనం కార్యక్రమానికి అనువుగా ఉంటుందన్నారు. కృష్ణా నది తీరాన ఉన్న బెరంపార్కు, దుర్గాఘాట్‌లో నిర్వహించే కార్యక్రమాలు కనువిందు చేస్తాయన్నారు. సంగీత నీరాజనానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ పరంగా జిల్లా యంత్రాంగం ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని రజిత్ బార్గవ్ తెలిపారు. కేంద్ర పర్యాటక శాఖ కార్యదర్శి వి. విద్యావతి ఇంద్రకీలాద్రి చేరుకుని కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శనం చేసుకున్నారు.అనంతరం సంగీత నీరాజనం నిర్వహించే తుమ్మలపల్లి కళాక్షేత్రం బెరంపార్కు, దుర్గ ఘాట్ పరిశీలించారు. సమావేశంలో పర్యాటక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హత్యకు నాకు సంబంధం లేదు

కాకినాడ, నవంబర్ 18,తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామంలో బొంత మహేంద్ర ఆత్మహత్యపై సీఐడీ విచారణకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించినట్లు హోంమంత్రి తానేటి వనిత తెలిపారు. మహేంద్ర మృతి అనంతరం జరిగిన పరిణామాలు తనను తీవ్ర మనస్తాపానికి గురిచేశాయన్నారు. వైసీపీని రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేక తనపైన, ప్రభుత్వంపైన దురుద్దేశంతో బురదజల్లుతున్నారని మంత్రి విమర్శించారు.మంత్రి వనిత విలేకురుల సమావేశంలో మాట్లుడుతూ.. పెనకనమెట్టలో 13వ తేదీన గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉండగా జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి భర్త పోసిబాబు ఫోన్‌లో మాట్లాడినట్లు చెప్పారు. ఆయన సోదరుడి కుమారుడు మహేంద్రను పోలీసులు తీసుకెళ్లారని తనకు చెప్పారు, వెంటనే స్టేషన్‌కి ఫోన్ చేయించి మహేంద్రను ఇంటికి పంపమని సూచించినట్లు తెలిపారు. తన సూచనలతోనే మహేంద్రను పోలీసులు ఇంటికి పంపినట్లు వెల్లడించారు.మహేంద్ర పురుగుల మందు తాగినట్లు తర్వాత రోజు తనకు తెలిసిందని మంత్రి తానేటి వనిత చెప్పారు. మహేంద్ర చికిత్స పొందుతున్న ఆసుపత్రి వైద్యులతో మాట్లాడానని, తర్వాత విజయవాడ తీసుకెళ్లినట్లు ఎవరూ చెప్పలేదన్నారు. 15వ తేదీ ఉదయం ఏలూరు రేంజ్ డీఐజీ ఫోన్ చేసి మహేంద్ర మృతి విషయం చెప్పినట్లు వెల్లడించారు. మహేంద్ర కుటుంబం ఏమీ చెప్పకపోయినా తానే చొరవ తీసుకుని చేయగలిగిన సాయమంతా చేశానని అన్నారు. మహేంద్ర మృతదేహం చూడడానికి నేతలతో కలిసి వెళ్తుండగా కొందరు యువకులు మోటారు సైకిళ్లపై వచ్చి కాన్వాయ్‌పై రాళ్లు, సీసాలు, కర్రలతో దాడులు చేశారని మంత్రి చెప్పారు. తానేదో పోలీసుల్ని ఆర్డర్ చేసి మహేంద్రను ఇబ్బంది పెట్టినట్లు ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## బీజేపీ ఆధ్వర్యంలో తాసిల్దార్ కి వినతిపత్రం...



విభారే న్యూస్ డోన్ మా ప్రతిని :- నవంబర్ 18 వెల్దుర్తి పట్టణం తాసిల్దార్ కార్యాలయం నందు బీజేపి కార్యకర్తలఆధ్వర్యంలో రేషన్ సరుకుల ప్యాకింగ్ పై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోటో ఉండాలని అలాగే రేషన్ వెహికల్ పై నరేంద్ర మోడీ ఫోటో ఉండాలని వారు వెల్దుర్తి తాసిల్దార్ కార్యాలయం నందు శనివారం తాసిల్దార్ శివరాముడు కి వినతి పత్రంఅందజేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ నేషనల్ ఆహార భద్రత చట్టం 2013 ప్రకారం కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రంలో ఉన్న1.5 కోట్ల రేషన్ కార్డులకు 60 శాతం సబ్సిడీతో సరుకులు అందిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం కేవలం 40%తో సప్లై చేస్తూ ప్రధాని మోదీ ఫోటో లేకుండా కేవలం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫోటో మాత్రం వేసుకోవడం చాలా దారుణం డిసెంబర్ రెండో తేదీలోగా ప్రధాని మోదీ ఫోటో రేషన్ సరుకుల పై అలాగే వాహనాలపై వెయ్యకపోతే బిజెపి రాష్ట్ర కార్యవర్గం పిలుపుమేరకు తగు చర్యలు తీసుకుంటామని వారన్నారు.

## గ్రంథాలయాల ద్వారా విజ్ఞానం పెంపొందించు కోవాలి



కోసిగి, నవంబర్18 (విభారె న్యూస్) ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని వాటి ద్వారా విజ్ఞానం పెంపొందించు కోవాలని కోసిగి గ్రంథాలయ అధికారి ఓబన్న అన్నారు.56 వ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గ్రంథాలయ అధికారి ఓబన్న ఆధ్వర్యంలో శనివారం కోసిగి బాలుర హై స్కూల్లో క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబన్న మాట్లాడుతూ గ్రంథాలయాలను విద్యార్థినీ విద్యార్థులతో పాటు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయ ల్లో అన్ని రకాల పుస్తకాలు ఉంటాయని వాటి ద్వారా సంపూర్ణ పరి జ్ఞానము పెంపొందించు కోవచ్చు అన్నారు. ఇందులో ఇంగ్లీష్, తెలుగు బుక్స్ ఉంటాయని తెలియజేశారు.ఇందులో వాలి బాల్ కోచ్ గంగప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ సమీకరణాలు.. కలిసొచ్చేదెవరికి...

ఏలూరు, నవంబర్ 18, ఏపీలో తెలంగాణ ఎన్నికల ప్రభావం ఖాయంగా కనిపిస్తోంది. తెలంగాణ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ నువ్వా - నేనా అన్నట్లుగా తలపడుతు న్నాయి. అక్కడ ఉత్కంఠ భరితంగా ఎన్నికలు సాగుతుండటంతో ఏపీ ప్రజల్లో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ రెండు పార్టీల్లో ఎవరు గెలిస్తే ఎవరికి కలిసి వస్తుందనే అంచనాలు మొదలయ్యాయి. ఏపీలోనూ ఎన్నికలు హోరా హోరీగా కనిపిస్తున్న ఈ సమయంలో పొత్తుల అంశం పైన తెలంగాణ ఫలితాలతోనే స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది. కర్నాటక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో కాంగ్రెస్‌పై అంచనాలు పెరిగాయి. ఇదే సమయంలో బీఆర్ ఎస్ శక్తిని కూడా తక్కువ అంచనా వేయలేమని పలువురు చెపుతున్నారు. గతంలో ముక్కోణపు పోటీ ఉంటుందని భావించినప్పటికీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీజేపీ కొంత వెనుకబడింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య నువ్వా? నేనా? అనే రీతిలో పోరుసాగుతోంది. మోసపోవద్దంటూ కేసీఆర్ హెచ్చిరిక ఏ మాత్రం పోల్ మేనేజ్‌మెంట్‌లో తేడా వచ్చిన ఫలితాలు తారుమారయ్యే అవకాశాలు ఉన్నాయి. ఏపీలోనూ తెలంగాణ ఎన్నికలపై ఆసక్తి కనిపిస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏపీలో ఓటర్ల పైన మానసికంగా తమకు అనుకూలంగా ఆలోచన మారే అవకాశం ఉందని ప్రతిపక్షాలు అంచనాగా కనిపిస్తోంది. తెలంగాణలో కేసీఆర్ పూర్తిగా పాజిటివ్ ఓటింగ్ నే నమ్ముకుంటున్నారు. పదేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో వచ్చిన మార్పులు..అమలు చేసిన సంక్షేమం తమను గెలిపిస్తాయని బీఆర్ఎస్ విశ్వసిస్తోంది. ఇదే సమయంలో కాంగ్రెస్ పూర్తిగా సంక్షేమ గ్యారెంటీ పథకాల పైనే ఆధారపడుతోంది. అవే తమకు ఓట్ల పంట పండిస్తామని నమ్ముతోంది.

## పోర్టు నిర్మాణం 25 నెలలో పూర్తి చేస్తాం..పోర్ట్ ఎండి మేకతోటి దయాసాగర్

మచిలీపట్నంమచిలీపట్నం వాసుల చిరకాల కోరిక అటువం టి నిర్మా ణం స్థానిక శాసనసభ సభ్యులు పేర్ని నాని సహకారం తో నిర్మాణం శరవేగంగా గా జరు గుతోందని పోర్ట్ ఎండి మేకతోటి దయాసాగర్ తెలిపారు. 2025 అక్టోబర్ నాటికి పోర్ట్ పనులు పూర్తవుతాయని తెలిపారు. నార్త్ బ్రేక్ వాటర్ పనులు పూర్తయ్యాయని సౌత్ బ్రేక్ వాటర్ పనులు జరు గుతున్నాయని ఆయన అన్నారు. పోర్ట్ నిర్మాణానికి ఎటువంటి ఆటంకాలు లేకపోవడంతో పనులు వేగంగా జరు గుతుందని అన్నారు. పోర్ట్ నిర్మాణానికి భూ సేకరణ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లా మని అన్నారు. అనుకు న్న సమ యం కంటే ముందుగానే పనులు పూర్తవుతాయని ఎమ్మెల్యే పేర్ని నాని ఆశా భావం వ్యక్తం చేశారు

# ఓట్ల పంచాయితీకి ఫుల్ స్టాప్ ఎప్పుడు

విజయవాడ, నవంబర్ 18, ఓట్ల పంచాయతీ నడుస్తోంది. అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలు నకిలీఓట్లపై ఎన్నికల కమిషన్‌కు వరుసగా ఫిర్యాదులు చేస్తున్నాయి. సుమారు ఆరు నెలలుగా రెండు పార్టీలు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనాకు పరస్పర ఫిర్యాదులు చేస్తున్నారు. తమ పార్టీ సానుభూతిపరుల ఓట్లు తొలగించేస్తున్నారంటూ రెండు పార్టీలు ఎవరికి వారు ఆరోపణలు చేస్తున్నారు. అంతేకాదు రెండు నెలల క్రితమే ఇరు పార్టీల నేతలు కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదులు చేసాయి. అయితే రాజకీయ పార్టీల నుంచి వస్తున్న ఫిర్యాదులపై కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో.. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి చర్యలు తీసుకుంటున్నారు. బోగస్ ఓట్లు, ఒకే డోర్ నెంబర్‌తో వందలాది ఓట్లు ఉండటం, మనుషులు లేకున్నా ఓటర్ ఐడీలు ఇస్తున్నారంటూ తెలుగుదేశం పార్టీ నాయకులు కొన్ని ఆధారాలను సీఈవోకు సమర్పించారు. మరోవైపు ఉరవకొండ, పర్చూరు నియోజకవర్గాల్లో ఓట్ల నమోదు, తొలగింపులో అక్రమాలు జరిగాయంటూ పలువురు అధికారులపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంది. అక్టోబర్ 21 వ తేదీ వరకూ డోర్ టు డోర్ వెరిఫై చేసిన తర్వాత ఇటీవల డ్రాఫ్ట్ ఓటర్ జాబితాను విడుదల చేసారు సీఈవో ముకేష్ కుమార్ మీనా. గత నెల 27న విడుదల చేసిన డ్రాఫ్ట్ జాబితాపై తాజాగా మళ్లీ తీవ్ర వివాదం మొదలైంది. డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్‌లో అవకతవకలు జరిగాయంటూ ప్రధాన పార్టీలు ఆరోపిస్తున్నాయి. టీడీపీతో పాటు వైసీపీ కూడా పోటాపోటీగా ఫిర్యాదులు చేస్తోంది. ఒకే ఇంటి నంబర్‌తో వందలాది ఓట్లు ఉన్నట్లు, స్థానికంగా ఉండే కొంత మందిని ఓటర్ జాబితా నుంచి తొలగించారని, ఒకే వ్యక్తికి వేర్వేరు చోట్ల ఓట్లు ఉండటం వంటి ఆరోపణలు వస్తున్నాయి. అయితే డ్రాఫ్ట్ ఓటర్ జాబితాపై అభ్యంతరాల స్వీకరణకు డిసెంబర్ 9 వ తేదీ వరకూ గడువు ఉంది. దీంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేలా ప్రత్యేకంగా పరిశీలకులను నియమించింది ఎన్నికల కమిషన్. ఇప్పటికే డ్రాఫ్ట్ ఓటర్ జాబితాను అక్టోబర్ 27 వ తేదీన విడుదల చేసిన ఎన్నికల సంఘం. వీటిపై అభ్యంతరాలకు డిసెంబర్ 9 వ తేదీ వరకూ గడువు ఇచ్చింది. ఆ తర్వాత డిసెంబర్ 10 నుంచి 26 వ తేదీ వరకూ అభ్యంతరాలను పరిష్కరించేందుకు గడువు పెట్టారు. డిసెంబర్ 27 నుంచి జనవరి 4 వ తేదీ వరకూ బీఎల్ వో ల వద్ద ఉన్న వర్కింగ్ కాపీ వెరిఫికేషన్ ఉంటుంది. జనవరి 5వ తేదీన ఫైనల్ ఎస్ఎస్ఆర్ విడుదల చేయనున్నారు. ఈ లిస్ట్ ప్రకారమే ఎన్నికలు జరగనున్నాయి. అయితే పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నందున ఎలాంటి సమస్యలు రాకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2024 కోసం పరిశీలకులుగా ఐదుగురు ఐఏఎస్ అధికారులను నియమించింది. ఓటర్ల జాబితాలోని లోపాలు సరిదిద్దేలా జిల్లా ఎన్నికల అధికారులకు పరిశీలకులు దిశానిర్దేశం చేయనున్నారు. ఆయా అంశాలను ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘానికి పరిశీలకులు రిపోర్ట్ ఇవ్వనున్నారు. ప్రతి జిల్లాలో డిసెంబర్ 9 లోగా ఓసారి, డిసెంబర్ 10 నుంచి 26వ తేదీలోగా రెండోసారి, డిసెంబర్ 27 నుంచి జనవరి 4వ తేదీలోగా మూడోసారి పర్యటించనున్నారు. స్థానికంగా రాజకీయ పార్టీల నాయకులు, ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించనున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, విశాఖ జిల్లాల పరిశీలకులుగా ఐఏఎస్ అధికారి జె.శ్యామలరావును నియమించారు. ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాలకు బి.శ్రీధర్‌ను నియమించారు. అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాలకు ఎన్.యువరాజ్ ఎంపిక చేసింది. బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు పోలా భాస్కర్‌ను నియమించింది ఈసీ. కర్నూలు, అనంతపురం, నంద్యాల, సత్యసాయి, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలకు డి.మురళీధర్‌ను ఎన్నికల సంఘం పరిశీలకులుగా ఎంపికయ్యారు. రాష్ట్రంలో ఆయా పార్టీలు చేస్తోన్న ఆరోపణలపై ఎన్నికల పరిశీలకుల నియామకం ద్వారా చెక్ పడుతుందేమో వేచిచూడాలి.

# బాలినేనికి పొగబెడుతున్నారా...

ఒంగోలు, నవంబర్ 18 , మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డికి వైసీపీలో ఎసరు పెట్టే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఒక పద్ధతి ప్రకారం బాలినేనిని పార్టీ నుంచి బయటకు పంపించాలని ప్లాన్ జరుగుతున్నట్లు సమాచారం. గత కొంతకాలంగా బాలినేని పై హై కమాండ్ అనుమానపు చూపులు చూస్తోంది. ప్రకాశం జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా బాలినేని వర్గాలను ప్రోత్సహిస్తున్నట్లు గుర్తించింది. వారందరిపై సస్పెన్షన్ వేటు వేస్తూ వస్తోంది. ఇప్పుడు వైసీపీ కీలక నేత వైవి సుబ్బారెడ్డి ప్రకటనతో.. బాలినేని శ్రీనివాస్ రెడ్డికి పొమ్మనలేక పొగ ప్రారంభమైందని వార్తలు వినిపిస్తున్నాయి. గతంలో ప్రకాశం జిల్లా అంతటా బాలినేని హవా నడిచేది. గత రెండు ఎన్నికల్లో ఏ నియోజకవర్గంలో నుంచి ఎవరిని బరిలో దించాలి? అన్నది బాలి నేనే నిర్ణయించేవారు. జగన్ సైతం ఆయనకు అంత గౌరవం ఇచ్చేవారు. అలాంటిది ఇప్పుడు ఆయన ప్రతిష్ట మసకబారింది. రెండేళ్ల కిందట మంత్రివర్గ విస్తరణలో తనకు మళ్ళీ అవకాశం దక్కుతుందని బాలినేని భావించారు. కానీ హై కమాండ్ పెద్దగా పట్టించుకోలేదు. అటు తరువాత సమన్వయ బాధ్యతలు వహిస్తున్న నెల్లూరు జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలు పార్టీకి తిరుగుబావుట ఎగురవేశారు. దీంతో సమన్వయకర్త బాధ్యతల నుంచి బాలినేని తప్పుకున్నారు. అయితే వైవి సుబ్బారెడ్డి రూపంలో బాలినేని ఆధిపత్యానికి ఎక్కడికక్కడే గండిపడుతూ వస్తుంది. తనను రాజకీయంగా దెబ్బ కొట్టాలని వైవి ప్రయత్నిస్తున్నారని పలుమార్లు సీఎం జగన్కు బాలినేని ఫిర్యాదు చేశారు. ఒకటి రెండుసార్లు పంచాయితీ నడిచినా.. బాలినేని కి మాత్రం పూర్వ గౌరవం దక్కడం లేదు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో బాలినేని అనుచరులుగా భావిస్తున్న నేతలను హై కమాండ్ క్రమశిక్షణ చర్యలు కింద సస్పెండ్ చేసింది. అంతటితో ఆగకుండా ప్రకాశం జిల్లా వ్యాప్తంగా.. అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను వైసీపీ హై కమాండ్



ఖరారు చేస్తోంది. తనను కనీసం సంప్రదించకుండా ఏకంగా అభ్యర్థుల పేరు ప్రకటించడం ఏమిటని బాలినేని అసంతృప్తికి గురయ్యారు. ఇటీవల నకిలీ స్టాంపుల కుంభకోణంలో ఎదురైన పరిణామాలతో తన సెక్యూరిటీని సైతం సరెండర్ చేశారు. చివరకు సీఎంవో కలుగజేసుకుని సమస్యను పరిష్కరించింది. రెండేళ్లుగా బాలినేని వ్యవహరించిన తీరుపై జగన్ ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. సరిగ్గా ఇటువంటి సమయంలోనే వైవి సుబ్బారెడ్డి తాను ఎంపీగా పోటీ చేస్తానని ప్రకటించారు. దీంతో ఒంగోలు రాజకీయాలపై ఫుల్ క్లారిటీ వచ్చింది. ప్రస్తుతం బాలినేని శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి ఒకే వర్గంగా కొనసాగుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఒంగోలు నుంచి మాగుంట శ్రీనివాసులు రెడ్డి కుమారుడు రాఘవరెడ్డి పోటీకి సిద్ధపడుతున్నారు. సరిగ్గా ఇటువంటి సమయంలోనే వైవి సుబ్బారెడ్డి ప్రకటన చేయడంతో వైసిపి హై కమాండ్ ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల క్రమం చూసుకుంటే బాలినేనికి వైసీపీ నుంచి ఎసరు ప్రారంభమైందని టాక్ నడుస్తోంది. కొద్ది రోజుల్లో దీనిపై ఫుల్ క్లారిటీ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి

# పాదయాత్ర ఎప్పుడు చినబాబు

రాజమండ్రి, నవంబర్ 18, నారా లోకేష్ పాదయాత్ర ఎప్పుడు ప్రారంభిస్తారు? అసలు యువగళం తిరిగి మొదలవుతుందా? లేదా? ఇప్పుడు ఏపీ పొలిటికల్ సర్కిల్ లో ఇదే చర్చ నడుస్తోంది. చంద్రబాబు అరెస్టుతో సెప్టెంబర్ 10న లోకేష్ పాదయాత్రను నిలిపివేశారు. ప్రస్తుతం చంద్రబాబు మధ్యంతర బెయిల్ పై బయటకు వచ్చారు. కానీ ఇంతవరకు లోకేష్ పాదయాత్రను తిరిగి ప్రారంభించలేదు. దీంతో పాదయాత్ర ప్రారంభించే ఉద్దేశం ఉందా? లేదా? అన్న అనుమానం కలుగుతోంది. ఈ ఏడాది జనవరి 27న కుప్పంలో లోకేష్ పాదయాత్రను ప్రారంభించారు. రాయలసీమలో సక్సెస్ ఫుల్ గా పాదయాత్రను పూర్తి చేశారు. ప్రారంభంలో వైసీపీ నేతల నుంచి ఇబ్బందులు ఎదురైనా.. అధిగమించి పూర్తి చేయగలిగారు. కోస్తాలో అడుగుపెట్టారు. అక్కడ కూడా విజయవంతంగా పూర్తి చేశారు. సరిగ్గా పశ్చిమగోదావరి జిల్లా శివారుకు వెళుతున్న తరుణంలో చంద్రబాబు అరెస్ట్ అయ్యారు. అప్పటినుంచి పాదయాత్ర నిలిపివేశారు. చంద్రబాబు జైల్లో ఉన్నంతకాలం న్యాయ నిపుణులతో చర్చలు అంటూ ఢిల్లీలో కాలం గడిపారు. మధ్యలో ఒకసారి వచ్చి పాదయాత్ర షెడ్యూల్ ను సైతం ప్రకటించారు. సీనియర్లు వారించడంతో తాత్కాలికంగా వాయిదా వేసుకున్నట్లు ప్రకటించారు. కానీ ఇప్పుడు చంద్రబాబు బయటకు వచ్చిన పాదయాత్ర చేసేందుకు మొగ్గు చూపకపోవడం హాట్ టాపిక్ గా మారింది. ఎందుకు పాదయాత్ర ప్రారంభించడం లేదు? అన్న చర్చ టిడిపి శ్రేణుల నుంచి వ్యక్తం అవుతోంది. తెలుగుదేశం పార్టీకి వారసుడిగా లోకేష్ తెరపైకి వచ్చారు. తండ్రి అరెస్టుతో క్రియాశీలక పాత్ర పోషించారు. అయితే ఇది చాలదని.. రాజకీయ ప్రత్యర్థులను అధిగమించాలంటే ఇంతకుమించి చేయాల్సి ఉంటుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. లీడర్ గా నిరూపించుకునేందుకు ఇది సరైన సమయం అని.. దూకుడుగా ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని.. ఎన్నికలకు మరో మూడు నెలల వ్యవధి ఉందని.. ఈ సమయంలో ఇలా ఉంటే ఎలా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. లోకేష్ పాదయాత్రకు సంబంధించి తూర్పుగోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో పెండింగ్ లో ఉన్నాయి. ఇంకా సుమారు వెయ్యి కిలోమీటర్లు లోకేష్ నడవాల్సి ఉంది. రాజోలు నియోజకవర్గంలో పాదయాత్ర నిలిచిపోయింది. ఇచ్ఛాపురం వరకు కొనసాగాలంటే కనీసం వంద రోజులు పాటు నడవాల్సి ఉంటుంది. అంటే ఈ లెక్కన మార్చి వరకు పాదయాత్ర కొనసాగించాల్సి ఉంటుంది. కానీ లోకేష్ లో ఎటువంటి చలనం లేదు. ఒకవేళ చంద్రబాబుకు రెగ్యులర్ పై లభించి.. రాజకీయ కార్యకలాపాలు ప్రారంభిస్తేనే లోకేష్ పాదయాత్ర ప్రారంభించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంలో తెలుగుదేశం పార్టీ స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. పాదయాత్ర ఎప్పుడు మొదలుపెడతారో.. ఒక ప్రత్యేక ప్రకటన చేస్తే బాగుంటుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరి టిడిపి హై కమాండ్ ఏం చేస్తుందో చూడాలి.

# అన్నీ రోడ్లు కడపవైపే

కడప, నవంబర్ 18, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు రహదారులు పట్టుకొమ్మలు. రవాణా వ్యవస్థ మెరుగుపడితేనే ప్రజల జీవన ప్రమాణాలు పెరిగినట్టు. కానీ ఇప్పుడు ఏపీలో అడుగేస్తే మడుగే అనేలా పరిస్థితి మారింది. గోతుల్లో రహదారులు వెతుక్కోవలసిన దౌర్భాగ్య పరిస్థితులు నెలకొన్నాయి. ఏటా గడువులు విధించడం.. గడువులు దాటిపోవడం పరిపాటిగా మారింది. రోడ్ల పరిస్థితి మాత్రం ఎక్కడి వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా మారింది. ఇటువంటి తరుణంలో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద రాష్ట్రంలో 115 రహదారుల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే ఇక్కడ కూడా రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన జిల్లాలపై వివక్ష చూపడం విమర్శలకు తావిస్తోంది. ఏపీలో రోడ్లు గురించి ఎంత చెప్పినా తక్కువే. గోతులు తేలిన రహదారులపై ప్రయాణించే వారిలో జగన్ ప్రభుత్వాన్ని శాపనార్థాలు పెట్టినోళ్లు ఉండరంటే అతిశయోక్తి కాదు. కానీ జగన్ సర్కార్ ఇవేవీ పట్టించుకోవడం లేదు. తమకు నచ్చిన రీతిలో ముందుకు సాగుతోంది. రోడ్ల మంజూరు, మరమత్తులు విషయంలో సైతం తన మార్కు రాజకీయం చూపుతోంది. ముఖ్యంగా ఉత్తరాంధ్రపై వివక్ష కొనసాగుతోంది. రాష్ట్రంలో 115 రోడ్లను ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద పక్కా రహదారులుగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 13 ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన రోడ్లు కేటాయించాల్సి ఉండగా.. సీఎం జగన్ తో పాటు సీనియర్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జిల్లాలకు పెద్దపీట వేయడం విశేషం. ఏపీకి మొత్తం 115 రహదారులు మంజూరయ్యాయి. అందులో సీఎం జగన్ సొంత జిల్లా కడపకు 35 రహదారులను కేటాయించారు. సీనియర్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత జిల్లా చిత్తూరుకు 15 రహదారులు కేటాయించారు. మిగతా రహదారులను.. మిగిలిన జిల్లాలకు సర్దేశారు. కానీ ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలకు కేటాయించింది 8 రహదారులే. ఇందులో శ్రీకాకుళం జిల్లాకు ఒకే ఒక రహదారిని పరిమితం చేశారు. విశాఖ జిల్లాకు రెండు రహదారులను కేటాయించారు. విజయనగరం జిల్లాకు మాత్రం ఐదు రహదారులను కేటాయించి పర్వాలేదనిపించుకున్నారు. అయితే జగన్, పెద్దిరెడ్డిల సొంత జిల్లాలోని రోడ్లు పాడయ్యాయా? కేంద్రం కేటాయించిన రహదారుల పనులు వీరు జిల్లాల కేనా? మిగతా జిల్లాలను పరిగణలోకి తీసుకోరా? అన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్ర పై వివక్ష చూపడం పై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జగన్ హయాంలో ఉత్తరాంధ్ర ఎంతో అభివృద్ధి చెందుతుందని మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సిదిరి అప్పలరాజు ఆర్భాటపు ప్రకటనలు చేస్తుంటారు. అటువంటి వారు ఎక్కడికి వెళ్లారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# ఇంటికి వెళ్లి మరీ సున్నా మార్కులు

నెల్లూరు, నవంబర్ 18, ఆంధ్రప్రదేశ్ లో వాలంటీర్లు రాజకీయాల్లో జోక్యం చేసుకుంటున్నారని వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేస్తున్నరన్న విమర్శలు వస్తున్నాయి. దీనికి తగ్గట్లుగానే పలు ప్రాంతాల్లో వైసీపీ విషయంలో వారు చేస్తున్న కార్యక్రమాలు వైరల్ అవుతన్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంలోని వాలంటీర్లు చేసిన పని అందర్నీ ఆశ్చర్య పరిచింది. బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో ప్రజలకు ఇష్టమున్నా లేకపోయినా తమ ఇళ్లపై వైసిపి జెండా ఎగరాల్సిందేనని ఆదేశాలు జారీ చేస్తున్నారు స్థానిక నాయకులు. ఇంటిపైన వైసీపీ జెండా కట్టించుకోకపోతే ప్రభుత్వము నుంచి వచ్చే సంక్షేమ పథకాలను తొలగిస్తామని వాలెంటరి ద్వారా బెదిరింపులకు పాల్పడుతున్నారు. వలంటీర్లు తమ పరిధిలో ఉన్న 50 ఇళ్లకు వెళ్లి జెండాలు కట్టిస్తున్నారు. 'చంద్రబాబు అమలు చేసిన పథకాలు ఎలా ఉన్నాయి? జగన్ అమలు చేస్తున్న నవరత్నాలు ఎలా ఉన్నాయి?' అని ప్రశ్నిస్తున్నారు. ఈ పరీక్షలో జగన్‌కు పదికి పది మార్కులు, చంద్రబాబుకు సున్నా మార్కులు వేయకపోతే పథకాలు రావని కొందరు గ్రామ వలంటీర్లు బెదిరింపులకు దిగుతున్నారు. చివరగా జగన్ పరిపాలన బాగుందని ఆ ఇంట్లోవారితో చెప్పించి, అందుకు సాక్ష్యంగా ఓ సెల్ఫీదిగి.. వైసీపీ నాయకుల వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేస్తున్నారు. ఆపు బాబు నాటకం ...జగనే మా నమ్మకం అనే స్టాంపును గ్రామాల్లో ఉన్న ఇండ్లకు కొందరు స్థానికులు వద్దంటున్నా కూడా బలవంతంగా వాలంటీర్లు వేస్తున్నారు. అంతటితో ఆగకుండా వాటిని సెల్ఫి తీసి సంతకం చేసి సోషల్ మీడియా గ్రూపులలో పోస్టు చేస్తున్నారు. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో వైరల్ గా మారుతోంది. స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది అంతా పార్టీ పెద్దలకు సింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి తెలిసే జరుగుతోందా..? లేక మండల నాయకులు అత్యుత్సాహంతో వాలంటీర్ల ద్వారా ఇలా చేస్తున్నారా అన్నది తెలియాల్సి ఉంది. ప్రజలు వైసీపీకి అనుకూలంగా ఉన్నారో, లేదో తెలుసుకోవడానికి వలంటీర్లతో ఇలా బలవంతపు సర్వే చేయిస్తున్నారు. దీనికోసం మండలానికో కన్వీనర్‌ను వైసీపీ ఏర్పాటు చేసింది. చాలామంది వలంటీర్లు ఇష్టం లేకుండానే ఈ సర్వేలో పాల్గొని, సెల్ఫీ దిగుతున్నారు. బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో ఓ క్రాంటాక్టు ఉద్యోగి వద్దకు వలంటీరు వెళ్లి 'నువ్వు కూడా ఫొటో దిగాలి.

# నాలుగేళ్లలో 4 వేల కోట్ల డిపాజిట్లు...

తిరుమల, నవంబర్ 18, (న్యూస్ పల్స్)తిరుమల వెంకన్న ఆదాయం అంతకంతకు పెరుగుతోంది. ఈ మధ్యకాలంలో గణనీయంగా పెరిగిన భక్తుల రద్దీతో పాటు హుండీ ఆదాయం కూడా అదే స్థాయిలో పెరుగుతోంది. ఆపద మొక్కుల స్వామికి కానుకలు సమర్పించే భక్తులు తిరుమలేశుడి ఆస్తుల విలువను పెంచుతున్నారు. వెలకట్టలేని బంగారు ఆభరణాలు వెంకన్న సొంతం కాగా గత నాలుగేళ్లలో శ్రీవారి ఆస్తుల విలువ రికార్డు స్థాయిలో నమోదు అయ్యింది. 2019 జూన్‌కు ముందు తిరుమలేశుడికి బ్యాంకుల్లో ఉన్న ఫిక్స్డ్ డిపాజిట్లు, గోల్డ్ డిపాజిట్‌లను టీటీడీ ఈవో ధర్మారెడ్డి ప్రకటించారు. టీటీడీకి ఉన్న 24 బ్యాంకు ఖాతాల్లోని ఫిక్స్డ్ డిపాజిట్లు, గోల్డ్ డిపాజిట్ల వివరాలను వెల్లడించారు. 2019 జూన్ 30 వరకు రూ. 13025.09 కోట్ల ఫిక్స్డ్ డిపాజిట్లు ఉండగా, 2023 అక్టోబర్ 31 నాటికి రూ. 17,816.15 కోట్లకు చేరుకున్నాయి. దీంతో గత నాలుగేళ్లలో శ్రీవారి ఆదాయం బ్యాంక్‌ల్లోని ఫిక్స్డ్ డిపాజిట్ల రూపంలో రూ. 4791.06 కోట్లకు పెరిగింది. ఇక బంగారు డిపాజిట్లు కూడా గణనీయంగా పెరిగాయి. టీటీడీ గోల్డ్ డిపాజిట్లు రెండు బ్యాంకుల్లో ఉన్నట్లు స్పష్టం చేసిన ఈఓ 2019 జూన్ 30 వరకు 7339.74 కేజీలు ఉండగా 2023 అక్టోబర్ 31 నాటికి 11,225.66 కేజీల బంగారం గోల్డ్ డిపాజిట్‌లుగా ఉంది. గత నాలుగేళ్లలో 3885.92 కేజీల బంగారం అదనంగా శ్రీవారి పేరుతో.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుల్లో గోల్డ్ డిపాజిట్లు ఉన్నాయి. ప్రస్తుతం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 10786.67 కేజీలు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో 438.99 కేజీల గోల్డ్‌నుటీటీడీ డిపాజిట్ చేసింది. టీటీడీ పాలన, శ్రీవారి ఆస్తులపై పలు ఆరోపణలు అనుమానాలు వ్యక్తం చేసిన టీడీపీ నేతల కామెంట్స్ పై స్పందించిన టిటిడి ఈవో బ్యాంకుల్లో ఉన్న ఫిక్సిడ్ డిపాజిట్లు, బంగారు డిపాజిట్లు వివారాలు ప్రకటించాల్సి వచ్చింది.

# కరువు నేలలో పసిడి పంటలు

కర్నూలు, నవంబర్ 18, కరువు సీమలో పంటల సంగతేమో కానీ బంగారం మాత్రం పండుతోంది. కిలోమీటర్ల కొద్దీ భూమి పొరల్లో దాగివున్న పచ్చని బంగారాన్ని వెలికి తీస్తున్నారు. ఇది వినడానికి చూడటానికి నమ్మశక్యం కాకపోయినప్పటికీ పచ్చినిజం. బంగారంకోసంఎన్నోఏళ్లుగాచేస్తున్న ప్రయోగాలు సక్సెస్ అయ్యాయి. ప్రస్తుతం బంగారం బయటకు తీస్తున్నారు. మీరు నమ్మాలంటే అక్కడికి స్వయంగా వెళ్లి బంగారు తవ్వకాలను పరిశీలించవచ్చు. రాయలసీమ కరువు కటకాలకు ప్రసిద్ధి. అలాంటి కరువు నేలలో పసిడి పంట పండుతుంది. ఆ పసిడి పంట కోసం దాదాపు 50 ఏళ్లుగా భూగర్భ పరిశోధనశాఖ తీవ్ర అన్వేషణ చేసింది. చివరికి కరవు నేలలో బంగారు పండుతుందని తేల్చారు. పత్తికొండ నియోజకవర్గ పరిధిలోని తుగ్గలి మండలంలోని పగిడిరాయి, జొన్నగిరి, బొల్లావానిపల్లి, రెవెన్యూ గ్రామాల పరిధిలో దాదాపు1550ఎకరాలలోయస్(రా)ఆకారంలోబంగారు నిక్షేపాల కోసం 1985 నుంచి 1990 వరకు హైదరాబాద్ లోని కేంద్ర ప్రభుత్వ సంస్థ భూగర్భ పరిశోధన శాఖ అధికారులు వివిధ రకాల అన్వేషణ చేశారు. అందుకు కొన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. జొన్నగిరి ప్రాంతంలో భూగర్భ పరిశోధన అధికారులు పెద్ద పెద్ద యంత్రాల సహాయం తో భూమిలో డ్రిల్లింగ్ పనులు చేపట్టారు. జొన్నగిరి.. పగిడిరాయి గ్రామాల మధ్య పెద్ద ఎత్తున పసిడి నిక్షేపాలు ఉన్నట్లు 1992 లో అప్పటి భూగర్భ పరిశోధన శాఖ డైరెక్టర్ జయరామి రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది గుర్తించారు. జీఎస్ఐ సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ రామారావు తో పాటు సిబ్బంది. భూమిలో ఉన్న బంగారు నిక్షేపాలు పొరలను ఎక్కడ ఉన్నాయో తెలుసుకొనేందుకు భూమిలోపల యంత్రాలతో పరిశీలిస్తూ పనులు ముమ్మరం చేశారు. పసిడి గనులు ఉన్నాయని ఒక అంచనాకు వచ్చారు. భూగర్భ పరిశోధన శాఖ అధికారులు కూడా పగిడిరాయి జొన్నగిరి గ్రామాల మధ్య బంగారు గనులు సొరంగాలు ఉన్నట్లు ఒక నిర్ధారణకు వచ్చారు. పసిడి గనులు ఉన్నట్లు అప్పట్లో జీఎస్ఐ శాఖ అధికారులు గుర్తించారు..కేంద్ర ప్రభుత్వానికి నివేదికలుఅందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు అప్పట్లో ఉన్న కర్నూలు జిల్లా అదనపు కలెక్టర్ స్మిత సబర్మల్ డ్రిల్లింగ్ పనులు పరిశీలించారు.

## మల్లెలల్ఫ్రెడ్ రాజ్ చేతుల మీదుగా ఆనంద్ రెండో పాట ఆవిష్కరణ



ఎమ్మిగనూరు నవంబర్ 18 విభారె న్యూస్.ఎమ్మిగనూరు మండలం సోగనూరు గ్రామ నివాసి రచయిత, గాయకుడు ఆనంద్ పాడిన రెండవ పాట ను ఎమ్మిగనూ రులోనీ వసుందర దేవి రెడ్ రోజ్ రెస్టారెంట్ లో సామాజికవేత్త డాక్టర్ మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు చేతుల మీదుగా రిలీజ్ చేయడం జరిగింది.. ఆనంద్ స్వరకల్పనలో ఈ యొక్క రెండవ పాటలో ముఖ్యంగా రాష్ట్రంలో నిరుద్యోగుల బాధల గురించి, వలసల గురించి మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాల గురించి పాట రూపంలో చాలా చక్కగా ఆనంద్ పాటను పాడారు.రాష్ట్రంలో నిరుద్యోగులు,రైతులు,మహిళలు పడుతున్న అవస్థల గురించి చక్కగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ జిల్లా కార్యదర్శి ఖదీర్ భాష, పిడిఎస్ యు రాష్ట్ర కార్యదర్శి రాజేష్, మీవేదం న్యూస్ రజాక్,బీసీ ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు శేఖర్, హెచ్ ఆర్ సి రైట్ టూ ఇన్ఫర్మేషన్ ట్రస్ట్ డివిజన్ అధ్యక్షులు అజిత్, ప్రతాప్,శ్రీకాంత్ ,శంకర్,భాస్కర్ హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో

## 5వ రోజు అన్న ప్రసాద వితరణ.



ఎమ్మిగనూరు నవంబర్ 18 విభారె న్యూస్.స్వాములకు అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా శనివారం 5వరోజు 18 – 11– 2023 శనివారం దాతలుఎమ్మిగనూరు వాస్తవ్యులు.శ్రీ సుంకులమ్మ అవ్వ స్వీట్ స్టాల్ ఎం. లక్ష్మీనారాయణ శ్రీమతి భవాని,సురేష్, శ్రీమతి మాధవి ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేసినారు.వారిని వారి కుటుంబాలకు శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి వారి. కృపా కటాక్షములు ఉండాలని ,ఎల్లవేళలా ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలనిస్వామి వారిని ప్రార్థిస్తూ... ఆలయంలో అన్నదానం పెట్టదలచుకున్న దాతలు కమిటీ వారిని సంప్రదించి తగు తేదీలను నమోదు చేయించుకో గలరు..అదేవిధంగా అన్నదాన కార్యక్రమం విజయవంతం చేయాలని,స్వామివారి కృపా కటాక్షములు పొందగలరని కోరుతున్నాము..ఇట్లు – ఆలయకమిటీ సెల్ 9951801818.

**సహకార సంఘ జెండాను ఆవిష్కరించిన చైర్మన్ యూ.కే.రాజశేఖర్.**

ఎమ్మిగనూరు నవంబర్ 18 విభారె న్యూస్.పట్టణంలో 70వ సహకార వారోత్సవాలు సందర్భంగా కో ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ కార్యాలయంలో చైర్మన్ యూకె. రాజశేఖర్ ఆధ్వర్యంలో 5 వరోజు టౌన్ బ్యాంక్ నందు యూకే రాజశేఖర్ టౌన్ బ్యాంకు చైర్మన్ సహకార సంఘ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సీఈవో గంగాధర్ డైరెక్టర్లు చంద్ షేక్ వడ్డే రంగన్న శ్రీరామ్, రజాక్,పల్లవి రాజశేఖర్, సీఈవో గంగాధర్,బ్యాంక్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.



## సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీల రిలే నిరాహార దీక్షలు..





విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :–నవంబర్ 18 అంగన్వాడీ వర్కర్స్ తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డోన్ ఐసిడిఎస్ కార్యాలయం దగ్గర శనివారం నిర్వహించిన రిలే నిరాహార దీక్షలలో పెద్ద ఎత్తున పాల్గొన్న అంగన్వాడి కార్యకర్తలు,ఈ కార్యక్రమానికి ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శేభారాణి, సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం,పట్టణ అధ్యక్షులు నక్కిశ్రీకాంత్,మండల కార్యదర్శి ఏవి.భాస్కర్ రెడ్డి హాజరు అయ్యారు.దీక్షల సందర్భంగా కొత్తకోట సెక్టార్ నుండి సువర్ణ లత,సుజాత ల ఆధ్వర్యంలో 20 మంది అంగన్వాడి టీచర్లు,20 మంది ఆయాలు ఏఐటీయూసీ నుండి సీఐటీయూ లో చేరి రిలే నిరాహార దీక్షలలో పాల్గొన్నారు.అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ చేస్తున్న రిలే నిరాహార దీక్షలను సందర్శించిన ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు కోయిలకొండ నాగరాజు,మోటార్ వర్కర్స్ యూనియన్ శివరంగస్వామి, రాము,డివైఎఫ్ఐ మండల అధ్యక్ష,కార్యదర్శులు హబీబ్ భాషా,నక్కీహరి,ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష,కార్యదర్శులు మహబూబ్ బాషా,అశోక్, ఆటో యూనియన్ అల్లబకాష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కుల్లాయప్ప,పెద్దఎల్లయ్య లు మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీని అమలు చేయాలని,మినీ సెంటర్లు అన్నింటిని మెయిన్ సెంటర్లుగా మార్చాలని,అంతవరకు మెయిన్ టీచర్లకు ఇచ్చే వేతనం ఇవ్వాలని,మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ 5 లక్షలకు పెంచాలని,ఆఖరి వేతనంలో 50% పెన్షన్ ఇవ్వాలని,హెల్పర్ల ప్రమోషన్లలో నిబంధనలు రూపొందించాలని,రాజకీయ జోక్యం అరికట్టాలని, ప్రమోషన్స్ వయసు 50 సంవత్సరాలకు పెంచాలని, సర్వీస్ లో ఉండి మరణించిన అంగన్వాడి వర్కర్స్,హెల్పర్స్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని,బీమా అమలు చేయాలని,రిటైర్మెంట్ వయసును 62 సంవత్సరాలకు పెంచాలని,వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలని,వైయస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని,గ్యాస్ ను ప్రభుత్వమే సరఫరా చేయాలని,పెండింగ్ లో ఉన్న సెంటర్ అద్దెలు,2017 టీఏ బిల్లులు,ఇతర బకాయి బిల్లులన్నీ వెంటనే చెల్లించాలని, లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులు ఇవ్వాలని,ఎఫ్ ఆర్ ఎస్ యాప్ ను రద్దు చేయాలని,మూడు యాప్ లను రద్దు చేసి ఒకే యాప్ ద్వారా విధులు నిర్వహించే విధానం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.పై కోర్కెలు అన్నింటిని అమలు చేస్తానని జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారని ఇప్పటికైనా అమలు చేయాలని లేని యెడల డిసెంబర్ 8 నుండి నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు.అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు నాగలక్ష్మి,సులోచన, సుమలత, రహమద్ బి,శ్రీలత,యశోద, లక్ష్మీస్వరి తదితరులు పాల్గొన్నారు.


## 95వ రాయలసీమ నామకరణ దినోత్సవం

**– నిరుద్యోగుల సమక్షంలో కేక్ కట్ చేసిన రాయలసీమ స్టీరింగ్ కమిటీ(ఆర్ఎస్ఎస్సి) నాయకులు ఆర్ విఎస్ సీమకృష్ణ,ఏ.సురేంద్ర రెడ్డి, నాగభూషణం.**



కర్నూలు నవంబర్ 18 విభారె న్యూస్.పట్టణంలోని విజేత కోచింగ్ సెంటర్ లో శనివారం నిరుద్యోగుల సమక్షంలో రాయలసీమ నామకరణ దినోత్సవం సందర్భంగా రాయలసీమ స్టీరింగ్ కమిటీ నాయకులు కేక్ కట్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా రాయలసీమ స్టీరింగ్ కమిటీ నాయకులు ఆర్ విఎస్ సీమకృష్ణ,ఏ సురేంద్ర రెడ్డి,నాగ భూషణం మాట్లాడుతూ 1928 నవంబరు 17,18 తేదీలన నంద్యాల పట్టణంలో ఆంధ్రమహాసభ సభలు జరిగాయని,ఈ రెండు రోజుల సభలలో 17 న ఆంధ్రరాష్ట్రీయసభ,ఆంధ్రమహాజనసభ, ఆంధ్ర సర్వపక్ష సమావేశసభలు జరిగాయన్నారు.18 న ఉదయం ప్రథమ దత్తమండల సమావేశం ప్రారంభమయిందని ఈ సభకు కె. శరభారెడ్డి సభ ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కాగా,కడప కోటిరెడ్డి అధ్యక్షతన కొనసాగిందన్నారు.ఈ సభలో అనేక రాయలసీమ సమస్యలు చర్చకు వచ్చాయన్నారు.ఇదే సందర్భంలో చిలుకూరి నారాయణరావు అనంతపురం కాలేజి అధ్యాపకులు,(శ్రీకాకులం వాసి) ఈ ప్రాంతానికి దత్తమండలం బదులు "రాయలసీమ" అని ఉంటే బాగుంటాదని ప్రతిపాదించాడన్నారు.నిజానికి చిలుకూరి వారు1928 సెప్టెంబర్ 8 నాడే "దత్త" అనే గేయం రాసి కాలేజి మ్యాగజైన్ లో ప్రచురించాడు.ఈ ప్రాంతం దత్త కాదని చాలా గొప్పదని ఆ గేయంలో తెలిపారన్నారు.చరిత్రలో రాయలసీమ అనే పదప్రయోగం మట్ల అనంత భూపాలుడి ఆస్థానంలో వెలువడిన"అభిషిక్తరాఘవీయం" కావ్యం లో కనిపిస్తుందని చిలుకూరు వారు రాయలసీమ పేరు పై స్పష్టంగా తన ఆలోచనలు నంద్యాలలో తెలియచేశారన్నారు.ఈ ప్రాంత ఆత్మగౌరవానికీ ప్రతీకగా రాయలసీమ పేరును సీమవాసులందరు ఏకగ్రీవంగా ఆమోదించారు.ఈ పేరునే పప్పూరు రామచార్యులతో పాటు,మిగతా సీమ నాయకులు వ్యాప్తి లోకి తీసుకొచ్చారు.దత్తమండలం నుండి రాయసీమ గా మారిన ఆ దినాన్ని "రాయలసీమ ఆత్మగౌరవదినం"గా బావించి 95వ రాయలసీమ నామకరణ ఆత్మగౌర దినోత్సవం జరుపుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో హరి నాయుడు, గోపాలు, బజారి పాల్గొన్నారు.

## మద్దిలేటి నరసింహ స్వామి వారికి భక్తులు కానుకలు సమర్పణ.....



విభారే న్యూస్ డోన్ మా ప్రతిని :– నవంబర్ 18 ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి దేవస్థానం నందు శనివారం భక్తులు అధిక సంఖ్యలో హాజరైనట్లు చైర్మన్ సీతారామచంద్రుడు, పాండురంగారెడ్డి కార్య నిర్వహణ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులు వేకువ జాము నుండి అభిషేకాలు గండ దీపాలు పుట్టువెంట్రుకలు, తలనీలాలు భక్తి శ్రద్ధలతో చెల్లించుకున్నారు. తద్వారా స్వామివారి సేవా టికెట్లు, లడ్డు ప్రసాదము, కేశఖండనము, రూము బాడిగలు మరియు లీజు వసూళ్ల ద్వారా వచ్చిన ఆదాయం10,09,527/– వచ్చినట్లు వారు తెలిపారు అలాగే కర్నూలు పట్టణమునకు చెందిన గుర్రం చిన్న మద్దిలేటి వీరి సతీమణి గుర్రం లక్ష్మీదేవి అమ్మ వారి కుమారులు దేవస్థానానికి వచ్చు భక్తుల కొరకు 2,70,000/– విలువ గల సుమారు రెండు కిలోమీటర్ల మేర పైపులైనుకు విరాళం సమర్పించినట్లు తెలిపారు అలాగే డోన్ మండలం కన్నప్ప కుంట గ్రామానికి చెందిన జైపాల్ రెడ్డి వీరి సతీమణి లక్ష్మీదేవి అమ్మ దంపతులు దేవస్థానం అభివృద్ధి నిమిత్తం 1,001,16/– నగదు విరాళం ఇచ్చినట్లు వారు తెలిపారు.

## టిప్పు సుల్తాన్ విగ్రహ స్థాపనకు అనుమతి ఇవ్వాలని టిప్పుసుల్తాన్ ట్రస్ట్



అనంతపురం ప్రతినిధి విబరే న్యూస్ నవంబర్18 హజ్రత్ టిప్పు సుల్తాన్ విగ్రహం ఏర్పాటుకు అనుమతినివ్వాలని కోరుతూ నగరపాలక సంస్థ మేయర్ వసీం సలీం మేయర్ కి టిప్పు సుల్తాన్ ట్రస్ట్ కమిటీ సభ్యులు మరియు మైనారిటీ నాయకులు వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ అనంతపురం నగరంలో పాత ఊరు విజయ్ క్లాస్ సర్కిల్ నందు హజరత్ షహీద్ టిప్పు సుల్తాన్ రహీమహుల్లా విగ్రహ స్థాపనకు అనుమతి ఇవ్వాలని అలాగే విగ్రహ స్థాపన చేయాలని మాట్లాడటం జరిగింది ఎందుకంటే ఆయన భారత దేశ మొట్టమొదటి స్వాతంత్ర పోరాట మరియు బ్రిటిష్లను గడగడ లాడించిన సమరయోధులని మరియు స్వాతంత్రం కోసం బ్రిటిష్ లతో పోరాడి తన ప్రాణ త్యాగం చేశారని కావున ఇలాంటి వారి విగ్రహం స్థాపించడం మన బాధ్యతని దీనికి ప్రతి ఒక్కరు సహకరించాలని తెలియజేశారు మేయర్ కూడా స్పందించి అధికారులకు పిలిపించి మాట్లాడి త్వరలో అనుమతివచ్చేవిధంగా తన వంతు కృషిచేసి హజరత్ టిప్పు సుల్తాన్ విగ్రహంస్థాపిస్తామనితెలియజేశారుఈ కార్యక్రమం లో టిప్పు సుల్తాన్ ట్రస్ట్ వ్యవస్థాపక కార్యదర్శి మౌలానా ఉమేష్ షేక్నదివి , 12వ డివిజన్ కార్పొరేటర్ జన బలం బాబా ,భాష,రషీద్, సలీం, షామీర్, ముస్తఫా, బాబా గడ్డ, జాకీర్,బబ్లు,సుహేల్,సద్దాం,బాలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి దారేది.... – టిడిపి, జనసేన ఉమ్మడి పార్టీల విమర్శ.



ఎమ్మిగనూరు నవంబర్ 18 విభారె న్యూస్.శనివారం రాష్ట్ర టిడిపి, జనసేన ఉమ్మడి పార్టీల ఆదేశాల మేరకు రాష్ట్రానికి దారేది కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మిగనూరు పట్టణంలోని దళిత కాలనిలో ఎం.బి. చర్చి సమీపంలో పూర్తిగా పాడైపోయిన రోడ్లను ఎమ్మిగనూరు నియోజకవర్గ జనసేన పార్టీ బాద్యురాలు శ్రీమతి రేఖా గౌడ్,టిడిపి, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి రోడ్ పై బైఠాయించి 4సంవత్సరాలలో గుంత కూడా పూడ్చలేని వైసిపి ప్రభుత్వం – సిగ్గు సిగ్గు ఈ రాష్ట్రానికి జగన్ – వద్దు వద్దు హాలో ఏపీ– బై బై వైసిపిఇదేమిరాజ్యం ఇదేమి రాజ్యం – దొంగల రాజ్యం దోపిడీ రాజ్యం అంటూ నినాదాలు చేస్తూ శ్రీమతి రేఖా గౌడ్ తో కలిసి రోడ్డుపై పడిన గుంతలను చూపిస్తూ వైసిపి ప్రభుత్వానికి సెల్ఫీ ఛాలెంజ్ విసిరి నిరసన తెలియజేస్తున్న ఎమ్మిగనూరు నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు డా బి వి జయనాగేశ్వర రెడ్డి.

## నేడు పాశం వెంకటేశ్వర్లుకు సన్మానం.

**సమాజ్ వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షులు...**

ఒంగోలునవంబర్18విభారెన్యూస్.సమాజం లో ప్రజలు అందరూ సమానమే అని సంపదలో ప్రతి ఒక్కరికీ భాగం ఉందని ఉత్పత్తి కులాలు ప్రాముఖ్యతపెరగాలి అనే భావజాలం తో ఏర్పడిన పార్టీ సమాజ్ వాదీ పార్టీ..అణగారిన వర్గాల సంక్షేమం కోసం పోరాటం చేస్తున్న పార్టీ సమాజ్ వాదీ పార్టీ సమానరాజ కీయ ప్రాతినిత్యం కోసం ఎలుగెత్తి గొంతుక వినిపిస్తున్న పార్టీ సమాజ్ వాదీ పార్టీ.రామ్ మనోహర్లోహియాభావజాలం,అంబేద్కర్, పెరియార్,మహాత్మాజ్యోతిభా పూలే, నారాయణ్ గురు మొదలైన సామాజిక విప్లవ కారుల ఆలోచనల నుండి వారి భావజాలం ను ఆచరణ లోకి తీసుకురావాలానే సత్సంకల్పం తో నేతాజీ ములాయం సింగ్ యాదవ్ స్థాపించినదే సమాజ్ వాదీ పార్టీ.ఇది బిసిలందరి పార్టీ. పోరాటం ఊపిరిగా జీవించిన మహా నాయకులు నేతాజీ ములాయం.నేడు మచ్చ లేని మహా నాయకులు అఖిలేష్ భయ్యా నాయకత్వంలో బీ.సీ,ఎస్.సి,ఎస్.టి మైనారిటీ వర్గాల ప్రయోజనాల కోసం పోరాటం చేస్తున్న పార్టీ మన సమాజ్ వాదీ పార్టీ.అటువంటి సోషలిస్ట్పార్టీ అవసరం చాలా ఉంది. ఎంబీబీఎస్ లో జరుగుతున్న అన్యాయంపై పోరాటం,కులగణన కోసం మొదటి నుండి డిమాండ్ చేస్తున్న పార్టీ సమాజ్వాదీపార్టీ.ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా సోషలిస్ట ధింకర్స్ పోరం అధ్యక్షులు బొట్ల మధు, సమాజ్ వాదీ పార్టీ రాష్ట్రఎస్సీ నాయకులు వంగేపురపు కార్తిక్ రాజు, ములాయం సింగ్ యూత్ బి గ్రేడ్ అధ్యక్షులు కల్యాణ్, ప్రజాసంఘాలు, బి.సి, ఎస్ సి, ఎస్టి, మైనార్టీ నాయకులు పాల్గొంటారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**